12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 333 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 6 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 333 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 6 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




# ఇంటింటికీ జలధార..

## రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ. 30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు.
ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు

- మిగతా 2లో



# అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ
- ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి
- వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు.

- మిగతా 2లో

# 2029 నాటికి 4-స్టార్..

## ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని

- మిగతా 2లో



# రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

- మిగతా 2లో

# వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

- టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- పల్లె పండుగ 3.0, జలజీవన్ మిషన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ

- మిగతా 2లో



# నిజం బయటపడ్డది..




## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై రాహుల్ ఫైర్

పెన్ పవర్ డెస్క్: సర్ ప్రక్రియలో అవకతవలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష తీరుపై ఆరోపణలకు సంబంధించి కేంద్ర

- మిగతా 2లో



# 'మా అనుమతి లేదు'..

## ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

పెన్ పవర్ డెస్క్:కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు.ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని

- మిగతా 2లో

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి



# రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:పెరుగుతున్న అత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అత్యాచారం చేసే వారికి శిక్షలు మరింత కఠినంగా ఉండాలని .. రేప్ చేయాలం టేనే భయపడి పోవాలని ఢిల్లీ పోలీసులు కీలక ఆదేశాల జారీ చేసింది. ఢిల్లీ ఎన్ సీఆర్ అత్యాచారం కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

- మిగతా 2లో




# భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

పెన్ పవర్ డెస్క్:భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగు తున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో

# వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

## మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరొత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి

- మిగతా 2లో



# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

## సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు.తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# నిజం బయటపడ్డది..

- మొదటి పేజి తరువాయి

ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇవ్వడంపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన రాహుల్ గాంధీ.. ఫారమ్ 6లో మార్పులకు ఎటువంటి ఆమోదం తెలపలేదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్?పై ఫైర్ అయ్యారు.
'జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారన్నది ఇప్పుడు నిస్సందేహంగా రుజువైంది. బీజేపీకి సహాయం చేయడానికి అతను తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు మాత్రమే. మన ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో పాలుపంచుకున్న జ్ఞానేష్?తో పాటు ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉంటారు" అని రాహుల్ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చిన తర్వాత సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

**ఈసీ, కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు**

సర్ ప్రక్రియలో అవకతకవలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఆయనను పదవి నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. అక్టోబర్ 5న ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో మిగిలిన ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.
అంతేకాకుండా, ఫామ్ 6 మార్పులకు తాము ఎటువంటి ఆమోదం తెలపలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫామ్ 6?లో మార్పులు ఎవరు చేశారో రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. దేశంలోవ కోట్ల సంఖ్యలో ఓటర్లను తొలగించారన్న ఆరోపణల వేళ కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

నేరం పాల్పడే వారి మనసులో చట్టం పట్ల భయాన్ని కలిగించడం అవసరమని కోర్టు తెలిపింది. నేరం చేస్తే ఏం జరుగుతుందో , వాటి పరిణామాలకుభయపడకపోతే, అటువంటి నేరాలను నివారించడం కష్టమని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. సమాజంలోని ప్రతి మహిళ మన తల్లి, సోదరి వంటిది. మనం వారికి భద్రతా భావాన్ని కల్పించాలి. మనం ఇంట్లో మహిళల భద్రతను ఎలాగైతే నిర్ధారిస్తామో, సమాజంలో కూడా అలాగే చేయాలి. ఒక మహిళ బస్సులో ఒంటరిగా ప్రయాణిస్తుంటే, పోలీసులకు ఆమె గురించి సమాచారం ఉండాలని, ఆమె భద్రతపై చురుకుగా వ్యవహరించాలని కోర్టు పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణ నవంబర్ 16కు వాయిదా వేసింది.

**నేరాలపై నిఘాకోసం వార్ రూం..**

నేరాల నియంత్రణకు ఓ వార్ రూం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఢిల్లీపోలీసులను ఆదేశించింది. నేరాలను అరికట్టడంలో ఢిల్లీ పోలీసులు ఏవైనా ప్రత్యేక చర్యలు చేపట్టారా.. వార్ రూం లాంటిది ఏర్పాటు ఏదైనా ఏర్పాటు చేశారా అని పోలీసులను ప్రశ్నించింది. జాతీయ డేటా బేస్ ద్వారా అనుమానిత క్రిమినల్స్, ప్రమేయం ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టాలని అధికారులను కోర్టు కోరింది. మహిళలు, విద్యార్థులనుపదే పదే వేధించే వ్యక్తులు ఉన్నారని, అన్ని ఏజెన్సీలు కలిసి నిఘా ఉంచితే పరిస్థితిని చక్కదిద్ద వచ్చని తెలిపింది. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులకు వార్నింగ్ ఇచ్చింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 2012 నిర్భయ కేసును కూడా ప్రస్తావించింది. అనుమతి లేకుండా నడుస్తున్న హోటళ్లలో మద్యం కూడా అందిస్తున్న ప్రదేశాలపై దృష్టి సారించాలని కోర్టు ఢిల్లీ పోలీసులను కోరింది. 2012 నాటి ఘటనకు సంబంధించిన రికార్డుల ప్రకారం, నిందితురాలు నేరం చేయడానికి ముందు ఓ ప్రదేశంలో భోజనం , మద్యం సేవించినట్లు కోర్టు పేర్కొంది.ఢిల్లీలోని భద్రతా ఏర్పాట్లపై కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. బహిరంగ ప్రదేశాలు, పార్కులలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సొలిసిటర్ జనరల్ ను కోరింది. క్షేత్రస్థాయిలో పోలీస్ నిఘా, జవాబుదారితనం, నియంత్రణ చర్యల అవసరాన్ని ధర్మాసనం నొక్కిచెప్పింది.

### భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు.సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

# ఇంటింటికీ జలధార..

- మొదటి పేజి తరువాయి

ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

**రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు**

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

**గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష
హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.
కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 2029 నాటికి 4-స్టార్..

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట**

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు.

**అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం పరుగులు**

ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'ను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

**స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట**

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

### మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరొత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది.మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు.ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడాప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.
ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడాప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు.ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్'కు 2019–24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు.2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు.తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### 'మా అనుమతి లేదు'.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

- మొదటి పేజి తరువాయి

సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్–6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.అయితే ఫారమ్–6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది.ఫారమ్–6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్–1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్–6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

### అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- మొదటి పేజి తరువాయి

వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు.ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**కేసు నేపథ్యం ఇదే..**

ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

# శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ :05:** త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంలో ఉత్తర మండల డిఎస్పి జీవన నేతృత్వంలో సీతానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సై ఎల్. శ్రీను నాయక్ ఆధ్వర్యంలోమండలంలో సోమవారం నాడు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. సీతానగరం గ్రామంలో బస్టాండ్ సెంటర్ నుంచి స్టేట్ బ్యాంకు వరకు తదితర ప్రాంతాల్లో ముందస్తు చర్యగా కవాతు నిర్వహించారు. 15మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# అడవితల్లి బాటకు పకడ్బందీ ఏర్పాట్లు

- అక్టోబర్ 8న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన
- మూడు రోజుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ కె.దినేష్ కుమార్
- భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- ఎస్పీ కె.చక్రవర్తి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** అక్టోబర్ 8న 'అడవితల్లి బాట' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పోలవరం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. పర్యటనకు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉన్నందున ఎలాంటి జాప్యం లేకుండా పనులను ప్రారంభించి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

సోమవారం రంపచోడవరం కలెక్టరేట్‌లోని ఐటీడీఏ సమావేశ మందిరంలో పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులు సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లను ప్రామాణికంగా తీసుకుని, అదే తరహాలో ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను స్పష్టంగా గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని, వాటి పురోగతిని రోజువారీగా సమీక్షించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

### హెలికాప్టర్ నుంచి రహదారి మార్గంలో పర్యటన

ఉప ముఖ్యమంత్రి రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్ ద్వారా పోలవరం జిల్లాకు చేరుకుని, అక్కడి నుంచి నిర్దేశిత రూట్‌మ్యాప్ ప్రకారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. హెలికాప్టర్ ద్వారా జిల్లాకు చేరుకున్న అనంతరం ఉప ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల వరకు రహదారి మార్గాన్ని సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పర్యటన మార్గంలో పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, పార్కింగ్, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పర్యటన మార్గాన్ని పరిశీలించి తుది రూట్‌మ్యాప్ ఖరారుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### కాకవాడ, రాకోట, లంకపాకాలలో ఏర్పాట్ల పరిశీలన

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రతిపాదిత కాకవాడ, రాకోట, లంకపాకాల ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. అనంతరం ఎస్పీతో కలిసి ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.రాకోటలో నిర్వహించనున్న రచ్చబండ, శంకుస్థాపన కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గ్రామస్థులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక, ప్రజలు కూర్చునే ప్రదేశం, రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి అన్ని ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టాలని స్పష్టం చేశారు.బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున జన సమూహాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పోలీసు బందోబస్తుకు సంబంధించి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

### అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో ప్రారంభించనున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలు తమ పరిధిలోని అభివృద్ధి పనుల వివరాలు, పనుల పురోగతి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పనుల జాబితాను సిద్ధంగా ఉంచాలని సూచించారు.హెలిప్యాడ్ ఎంపిక, నిర్మాణం, భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అగ్నిమాపక, వైద్య, అత్యవసర సేవల సిబ్బంది, అవసరమైన పరికరాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

### పీఎం జన్మన్ కార్యక్రమాలపై సమీక్ష

గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పీఎం జన్మన్ కార్యక్రమాలకు సంబంధించిన పనుల పురోగతి, ప్రారంభించాల్సిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సంబంధిత శాఖలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల వివరాలను సమగ్రంగా రూపొందించాలని ఆదేశించారు.'అడవితల్లి బాట' కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేయాల్సిన శిలాఫలకాలు, బోర్డులు, సభా ప్రాంగణానికి సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాల్సిన శిలాఫలకంతో పాటు సభా ప్రాంగణంలో అవసరమైన బోర్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు.



### భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి
### ఎస్పీ కె.చక్రవర్తి

ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి సూచించారు. పర్యటన మార్గం, హెలిప్యాడ్, రచ్చబండ, బహిరంగ సభ ప్రదేశాలు, పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే పరిశీలించి అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

### యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలి
### జేసీ ఎస్.ప్రశాంత్ కుమార్

పర్యటనకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖలు యుద్ధప్రాతిపదికన తమకు అప్పగించిన బాధ్యతలను చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అనుసరించిన సమన్వయ విధానాన్ని కొనసాగిస్తూ శాఖల మధ్య నిరంతర సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిని రోజువారీగా సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు.సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు, డ్వామా పీడీ బి.రాంప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ డి.రత్నాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.సరిత, డీసీహెచ్ఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్జీలను సానుభూతితో విని.. తార్కిక పరిష్కారం చూపాలి

- 'అవును' లేదా 'కాదు' అని స్పష్టంగా చెప్పాలి.. దాటవేత ధోరణి వద్దు
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 5:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీని అధికారులు బాధ్యతతో పరిశీలించి, పౌరుల సమస్యలకు చట్టబద్ధంగా, తార్కికంగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు.సోమవారం బొమ్మూరు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, డీఆర్వో ఎస్.భాస్కర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారులకు పరిష్కారంపై సూచనలు చేశారు.అర్జీదారుల సమస్యలను అధికారులు పూర్తిగా, ఓపికగా వినాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. సమస్యను పూర్తిగా తెలుసుకోక ముందే ముందస్తు అభిప్రాయానికి రావడం వల్ల సరైన పరిష్కారం చూపలేమన్నారు. పౌరుడి పరిస్థితిని తమ కుటుంబానికి ఎదురైన సమస్యగా భావించి స్పందించాలని సూచించారు. ఎంపతీ అంటే కేవలం సానుభూతి చూపడం కాదని, పౌరుడి కోణంలో సమస్యను అర్థం చేసుకుని స్పందించడ మేనని స్పష్టం చేశారు. 'ఇది మా శాఖ పరిధిలో కాదు' అంటూ తిప్పొద్దు ఒక సమస్య తమ శాఖ పరిధిలో లేదని చెప్పి పౌరులను ఇతర కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని కలెక్టర్ అన్నారు. అవసరమైతే శాఖల మధ్య సమన్వయం చేసుకుని అర్జీని సంబంధిత శాఖకు అధికారులే బదిలీ చేయాలని సూచించారు. సమస్యకు పరిష్కారం ఏ స్థాయిలో లభిస్తుందో విశ్లేషించి, పౌరులకు స్పష్టమైన మార్గదర్శకత్వం ఇవ్వాలన్నారు. నిబంధనల ప్రకారం పని చేయడానికి అవకాశం ఉంటే 'అవును' అని, సాధ్యం కాకపోతే 'కాదు' అని స్పష్టంగా తెలియ జేయాలని కలెక్టర్ సూచించారు. అర్జీదారులను రేపు, ఎల్లుండి అంటూ పదేపదే తిప్పకుండా నిబంధనల మేరకు నిర్ణయం తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో సక్రమంగా విచారణ జరగకపోవడం వల్లే కొంతమంది అర్జీదారులు మళ్లీ జిల్లా కార్యాలయానికి వస్తున్నారని తెలిపారు. మండల స్థాయి అధికారులకు నిర్ణయం తీసుకోవడంలో సందేహాలు ఉంటే తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌ను సంప్రదించి మార్గదర్శకత్వం తీసుకోవచ్చున్నారు. ఎంపీడీవోలు కూడా డీఎల్‌డీవో, డీపీవో తదితర ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఎండార్స్‌మెంట్ అర్జీకి అనుగుణంగా ఉండాలి. పౌరుడు కోరిన సమస్యకు అధికారులు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌కు స్పష్టమైన సంబంధం ఉండాలని కలెక్టర్ అన్నారు. సమస్యను పరిష్కరించలేని పరిస్థితుల్లో అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయడంతో పాటు, పరిష్కారం పొందేందుకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వివరించాలని ఆదేశించారు.పీజీఆర్ఎస్ అర్జీ అందిన వెంటనే సంబంధిత అధికారులు పిటిషనర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీ అందిందని, విచారణకు వచ్చే సమయంలో అవసరమైన ఆధారాలతో సిద్ధంగా ఉండాలని ముందుగానే తెలియజేస్తే పౌరులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. సేవా ప్రమాణాల గడువు ఉన్నప్పటికీ, అర్జీ అందిన వెంటనే స్పందించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు.జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల్లో వచ్చిన నూతన మార్గదర్శకాలు, సూచనలు, ఎస్ఓపీలను అధికారులు ఖచ్చితంగా పాటించాలన్నారు. పాత జీవోలు, పాత విధానాలను ఆధారంగా చేసుకుని వ్యవహరించకుండా ప్రస్తుత నిబంధనలను అనుసరించాలని సూచించారు. అర్జీలు వచ్చినప్పుడు ఒక శాఖ నుంచి మరో శాఖకు సమస్యను నెట్టేసి కేసును ముగించడం సరికాదన్నారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఎస్ఈ, ఎస్‌సీ స్థాయి అధికారులు కూడా సమన్వయంతో సమస్యను పరిష్కరించాలి తప్ప కేవలం ఎండార్స్‌మెంట్ ఇచ్చి అర్జీని ముగించ కూడదని స్పష్టం చేశారు.

### పూర్తిగా విన్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలి

డీఆర్వో ఎస్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పౌరుల సమస్యలను అధికారులు పూర్తి స్థాయిలో, ఓపికగా వినాలని సూచించారు. ఫిర్యాదును పూర్తిగా వినకముందే ముందస్తు అభిప్రాయానికి రావడం వల్ల బాధితులకు న్యాయం చేయలేమన్నారు. అర్జీదారు చెప్పే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా విన్న తర్వాతే నిర్ణయానికి రావాలని, సమస్యలను చట్టబద్ధంగా, సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.పీజీఆర్ఎస్‌లో బాధ్యత, జవాబుదారీతనం, సానుకూల దృక్పథంతో అధికారులు పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు.రెవెన్యూ (రెవెన్యూ క్లినిక్)కు 104, పంచాయతీరాజ్--గ్రామీణాభివృద్ధి శాఖకు 43, పోలీస్ శాఖకు 21 చొప్పున మొత్తం 168 ఫిర్యాదులు నమోదయ్యాయి. మిగిలిన శాఖలకు కలిపి 55 అర్జీలు అందాయి. వాటిలో పరిశ్రమలు-- వాణిజ్యానికి 5, జలవనరులకు 4, పురపాలక-- పట్టణాభివృద్ధికి 3, రవాణా--ఆర్అండ్‌బీకి 3 తదితర ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్.భాస్కర్ రెడ్డి, ఆర్డీవోలు ఆర్. శివరాముడు, కె. ఆనందరావు, ఎస్‌డీసీ పి. భాగ్యలక్ష్మి, డీఎస్పీ ఏ. శివప్రియ, సీపీఓ ఎల్. అప్పలకొండ, ఇతర జిల్లా అధికారులు, ఎస్‌డీసీలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించిన ఏపీటీఎఫ్

### ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 5:** అక్టోబరు 5 అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని తాళ్లపూడి ఏపీటీఎఫ్ యూనిట్ ఘనంగా నిర్వహించి జిల్లా, నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించినట్లు మండల ప్రధాన కార్యదర్శి మల్లిపూడి శోభన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా పైడిమెట్ట మండల పరిషత్ బేసిక్ పాఠశాల నందు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు డి.డి.రావు మాట్లాడుతూ అంతర్జాతీయ ఉపాధ్యాయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న తాళ్లపూడి ఏపీటీఎఫ్ యూనిట్ ను అభినందించారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎనలేని బాధ్యత కలిగినదని ఆ వృత్తిలో చేరడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. సమాజంలో ఉత్తమ పౌరులను తయారుచేయడంలో ఉపాధ్యాయులకున్న అవకాశాలు మరెవ్వరికీ ఉండవని, అటువంటి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన ఉపాధ్యాయులందరూ ధన్య జీవులన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఈ దేశానికి, సమాజానికి మార్గదర్శకులు అన్నారు. అవార్డు పొందిన ప్రతీవారు మరింత బాధ్యతతో పిల్లలను తీర్చిదిద్ది మరిన్ని అవార్డులు పొందుతారని ఆశించారు. కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు కొయ్య ప్రసాదరావు, కస్సే భరత్ రాజు, గొంతి సతీష్, జె.డి.సునీత, నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయులు రాజారత్నం, మూర్తి, రేవతి, కొలచన ప్రసాద్, పద్మశ్రీ మణి తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల యూనిట్ సభ్యులు విజయ కుమార్ రాజు, జి.కృష్ణ, వసంత ప్రసాద్, చిట్టిరాజు ఉన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి





- కాకవాడలో హెలిప్యాడ్, సభా ప్రాంగణం పరిశీలన.. రాకోటలో రచ్చబండకు ప్రత్యేక ఏర్పాట్లు
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబరు 5:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ నెల 8న పోలవరం జిల్లా రంపచోడవరం మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా కాకవాడలో హెలిప్యాడ్, బహిరంగ సభ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాకోట గ్రామంలో గ్రామస్థులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, రంపచోడవరం సబ్ కలెక్టర్ డొనక పృథ్వి రాజ్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాసరావు, భవాని తదితరులతో కలిసి ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.

కాకవాడలో హెలిప్యాడ్, సభా ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు, ప్రజలు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య, అగ్నిమాపక సదుపాయాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. పర్యటనకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.రాకోట గ్రామంలో నిర్వహించనున్న రచ్చబండ కార్యక్రమానికి సంబంధించి గ్రామస్థుల నుంచి వివిధ శాఖలకు వచ్చే సమస్యలను శాఖల వారీగా నమోదు చేసి, సాధ్యమైన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపేలా అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధించిన వివరాలను ముందుగానే సేకరించి సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి పోలీసు అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.పర్యటన ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. అక్టోబరు 7వ తేదీలోగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, తుది స్థాయి తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# సేవా స్ఫూర్తికి ఏడేళ్లు - మల్లవరంలో ఘనంగా 'సర్వ్ విత్ హార్ట్' 7వ వార్షికోత్సవం





✷ విద్యార్థులకు చేయూత, డీవీపీఆర్ పాఠశాలకు విరాళాలు

**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 04:**–పేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ గత ఏడేళ్లుగా విశేష సేవలు అందిస్తున్న 'సర్వ్ విత్ హార్ట్' స్వచ్ఛంద సంస్థ 7వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం మల్లవరం గ్రామంలోని డీవీపీఆర్ పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ సంస్థ ఆధ్వర్యంలో గత ఏడేళ్లుగా ఆకలితో ఉన్నవారికి ఉచిత భోజనం, నిరుపేదలకు దుస్తులు,దుప్పట్ల పంపిణీ,అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం, దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ, పేద విద్యార్థులకు విద్యా సహాయం, చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత, వృద్ధాశ్రమాలకు సహకారం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 7 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది మల్లవరం గ్రామ విద్యార్థులకు, డీవీపీఆర్ పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టారు. 100 మందికి పైగా విద్యార్థులకు రాత సామగ్రి, పాఠశాలకు బ్లాక్ బోర్డులు, పటాలు, బోధనా సామగ్రి అందజేశారు. విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం నీటి ట్యాంకు, మోటారు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అవసరంలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక భోజన వసతి కల్పించారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా ఒక గ్రామ విద్యాభివృద్ధికి తోడ్పడేలా ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయం. ఏడేళ్లుగా తమ సేవా ప్రయాణానికి అండగా నిలిచిన దాతలు, స్వచ్ఛంద సేవకులు, శ్రేయోభిలాషులకు 'సర్వ్ విత్ హార్ట్'నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందిస్తే మరింత మంది పేదలకు అండగా నిలవ గలమని పేర్కొన్నారు. మానవత్వం, సేవాభావం అనే విలువలతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# వేటమామిడి ఏకలవ్య పాఠశాలలో పోలీసులు అవగాహన కార్యక్రమం..





**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 05;** అడ్డతీగల మండలం వేటమామిడి ఏకలవ్య పాఠశాలలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల సీఐ ఎం. గజేంద్ర కుమార్, ఎస్ఐ బి. వినోద్ విద్యార్థులతో నేరుగా మమేకమై పలు ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. త్రిశూల్ కార్యక్రమంలో భాగంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, రోడ్డు భద్రత, గంజాయి ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన గుడ్ టచ్--బ్యాడ్ టచ్ అంశాలపై విద్యార్థులకు వివరించారు. రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సీఐ, ఎస్ఐలు సమాధానాలు ఇచ్చి, పోలీసు సేవలు మరియు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

# ఎన్నికల ఏర్పాట్లలో అలసత్వానికి తావులేదు



✷ పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి లోపాలను సరిదిద్దాలి
✷ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 5:**ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశాన్ని ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పటిష్టమైన ప్రణాళికతో సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో సమన్వయ శాఖల అధికారులు, మండల స్థాయిలో అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. కాంపౌండ్ వాల్, ప్రవేశం, నిష్క్రమణ మార్గాలు, ఓటర్లు సులభంగా రాకపోకలు సాగించే పరిస్థితులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. లోపాలు గుర్తించిన వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఒకే పోలింగ్ కేంద్రంలో నిర్దేశిత సంఖ్యకు మించి ఓటర్లు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. అవసరమైతే ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు లేదా ఇతర సాధ్యమైన మార్గాలను పరిశీలించాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రతి ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు సమర్థవంతమైన బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధులకు సంబంధించి బాధ్యతలు స్పష్టంగా కేటాయించుకుని, శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఎక్కడ ఏర్పాటు చేయాలి, ఆయా కేంద్రాలకు చేరుకునే రూట్ ప్లాన్ ఎలా ఉండాలి అనే అంశాలను అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. రవాణా, భద్రత, అందుబాటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల ఏర్పాట్లను కేవలం కార్యాలయాల్లో కూర్చుని రికార్డులు, పత్రాల ఆధారంగా పరిశీలించడం సరిపోదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఎంపిడిఓ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలి అని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక, సమన్వయం, పర్యవేక్షణతో పనిచేసి ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



**సీతానగరం, పెన్ పవర్ అక్టోబర్ :05:**మండలంలోని మిర్తిపాడు గ్రామంలోని మూడు అంగన్వాడీ కేంద్రాలలో సోమవారం పోషకాహార మహోత్సవాన్ని నిర్వహించారు. మూడు సెంటర్ల అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు , చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు చిన్నారులు రోజువారి ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లులు చిన్నారులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని ఆమె వివరించారు. చిన్నారులకు వినోదాత్మక ఆటలు నిర్వహించి చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ ఉత్సవం ద్వారా అంగన్వాడి కేంద్రాలలో అందరికీ పోషణ మాతృ సంరక్షణ టీకాలు సామాజిక సేవలకు సంబంధించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సేవల గురించి లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యవతి, పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరం





**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ :05 :**సీతానగరం మండలంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమంలోని రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 260 మందికి సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ కాద నాగేంద్ర ప్రసాద్ రావు, సత్యం రమేష్ బాబు తదితర వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు చికిత్స అందించారు. మొత్తం 260మందికి వైద్య సేవలు అందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో 116 మందికి రక్త నీరుడు పరీక్షలు ముగ్గురికి థైరాయిడ్ ఒకరికి ఈసీజీ పరీక్ష 65 మందికి కంటి పరీక్షలు 11 మందిని శుక్లాం ఆపరేషన్ నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ శిబిరంలో రోగులకు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలోపరమహంస యోగానంద నేత్రాలయ ప్రోగ్రాం మేనేజర్ నక్క చంటిబాబు, కస్తూర్బా గాంధీ ఆశ్రమ ప్రతినిధి కూమారి, జి. సుశీల, యాన్న మనివెంకట రమణ, వాలంటీర్, గిరి రాజ్ కృష్ణ, రామకృష్ణ, మిషన్ కోఆర్డినేటర్ కాను మోను శ్రీనివాస్, రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:**నగరపాలక సంస్థ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గ్రాండ్ ట్రంక్ రోడ్డులో డ్రెయిన్లపైన నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ర్యాంపులు, మెట్లు, బోర్డులను సోమవారం పట్టణ ప్రణాళిక అధికారులు జేసీబీలతో తొలగించారు. రోడ్లు, ఫుట్ పాత్ లను సగం వరకు ఆక్రమించి ర్యాంపులు, మెట్లు నిర్మించడం వల్ల ఆయా ప్రదేశాలు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. కాలువలపై ప్రహరీ గోడలు, శ్లాబులు, మెట్లు నిర్మించడం వల్ల నీటి ప్రవాహం ఆగిపోయి, వర్షాలు పడినప్పుడు ఆయా ప్రాంతాలు జలమయం అవుతున్నాయన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడటానికి, మురుగు నీరు సజావుగా సాగడానికి కాలువలపై ఉండే ఇటువంటి అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నట్లు తెలియజేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమానికి ప్రజలు, వ్యాపారులు పూర్తి స్థాయిలో సహకరించవలసిందిగా కోరారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

✷ రోడ్డు భద్రత, మహిళల రక్షణపై అవగాహన
✷ గంగవరం ఎస్సై ఎస్.వెంకయ్య




**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని గంగవరం ఎస్సై ఎస్.వెంకయ్య సూచించారు. మహిళల రక్షణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పోలీసు శాఖ చేపట్టిన ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాత గంగవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకయ్య మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మహిళల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణ, భద్రతా చర్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలు లేదా బాలికలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు.

అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలను జాగ్రత్తగా నడపాలని, రహదారిపై ఇతరుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకయ్య హెచ్చరించారు. దుర్వ్యసనాలకు బానిసలై ఎంతోమంది తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేసి వాటి నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు కె.రాంబాబు, పుండరీనాథ్, పోలీస్ కానిస్టేబుళ్లు అశోక్, కొండ తదితరులు పాల్గొన్నారు.

## నగర కార్పొరేషన్ పీజీఆర్ఎస్ కు 19 వినతులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:**ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని కాల పరిమితిలోగా తప్పనిసరిగా పరిష్కరించాలని కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించవలసిందిగా సంబంధిత విభాగాధిపతులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి తప్పనిసరిగా ఎక్నాలెడ్జ్ మెంట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తాము సమర్పించిన అర్జీల పరిష్కార ప్రక్రియను తెలుసుకునేందుకు 1100 నెంబర్ కు ఫోన్ చేయవచ్చ న్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 19 అర్జీలు రాగా వీటిలో పబ్లిక్ హెల్త్ కి 2, ఇంజనీరింగ్ కి 8, టౌన్ ప్లానింగ్ కి 6, వార్డు సచివాలయాలకు 2, హౌసింగ్ కు ఒకటి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అడహాక్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- తొమ్మిది మంది సభ్యులుగా ఎన్నిక



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:**ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (ఏపీవీఆర్ఏ) పోలవరం జిల్లా అడహాక్ కమిటీ సభ్యుల ఎన్నికలు సోమవారం రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి, పోలవరం జిల్లా అడహాక్ కమిటీ సభ్యుడు పయాజ్ బాషా అలియాస్ జిలాని అధ్యక్షతన ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రంపచోడవరం మండలానికి చెందిన కె.మల్లమ్మ, మారేడుమిల్లి మండలానికి చెందిన కె.యోనా, అడ్డతీగల మండలానికి చెందిన ఎస్.చిన్నారావు, దేవీపట్నం మండలానికి చెందిన ఎస్.విష్ణు, గంగవరం మండలానికి చెందిన ఆర్.రమేష్, రాజవొమ్మంగి మండలానికి చెందిన కె.అప్పలకొండ, వై.రామవరం మండలానికి చెందిన సిహెచ్.విశ్వకుమారి, చింతూరు మండలానికి చెందిన సిహెచ్.సుబ్బారావు, ఏటపాక మండలానికి చెందిన జె.ప్రసాద్ అడహాక్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.బ్రహ్మయ్యతో పాటు ఏపీఆర్ఎస్ఏ పోలవరం జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు ఎం.వెంకటేష్, టి.లక్ష్మణరావు, వి.పాల్ అలెగ్జాండర్, ఆర్.మహాలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. పోలవరం జిల్లా పరిధిలోని వివిధ మండలాలకు చెందిన గ్రామ రెవెన్యూ సహాయకులు ఎన్నికల్లో పాల్గొన్నారు.

## ఓట్లను సవరిస్తున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను రాజకీయం చేయడం తగదు

మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:**లోపాలతో కూడిన ఓట్లను భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో సవరిస్తున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దేశంలో 1952 నుండి నేటి వరకు ఓట్ల సవరణ జాబితాలు సుమారు 12 సార్లు జరిగాయని ఇంతకాలం లేని ఆరోపణలు వెనుక ఓట్ల రాజకీయమేనన్నారు. బిజెపి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఫారం నెంబర్ 6 లో మార్పులు చేశామని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని, అయితే ఒక్క పదం కూడా మార్చలేదన్నారు. ఓటర్ల సౌలభ్యం కోసం కొన్ని మార్పులు చేశారని, ఒక వ్యక్తికి, ఒకే చోట, ఒకే ఓటు పారదర్శకత ఎన్నికకు మూలమన్నారు. ఇది ఏకగ్రీవ నిర్ణయం కాదని, ఎలక్షన్ కమిషనర్లు కలిసి తీసుకున్న నిర్ణయమని,దీన్ని సుప్రీంకోర్టు కూడా ఆమోదించిందన్నారు. ఎలక్షన్ కమిషన్ సభ్యుల మధ్య చర్చల్లో భిన్న అభిప్రాయాలు ఉన్నాయి కానీ విభేదాలు లేవన్నారు. ఎలక్షన్ కమిషన్ ఐకమత్యంగా ఉంటే ప్రతిపక్షాలకు ఇబ్బందిగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లను కూడా నియమించుకోలేదన్నారు. దేశం అభివృద్ధి దిశగా వెడుతోందని ఓట్ల చోరీ చేయాల్సిన అవసరం బిజెపి కి లేదన్నారు. ఓటు చోరీ అనే పదాన్ని కాంగ్రెస్ పార్టీ టూల్ కిట్ గా వాడుకుంటుందన్నారు.

**మోదీని విమర్శించే స్థాయి అభిజిత్ దీప్కే కు లేదని,**

జన్ జి ఉద్యమాలకు విదేశాల మద్దతు ఉందన్నారు.

రాష్ట్రంలో మద్యం ధరలు తగ్గించాలని తాను డిమాండ్ చేస్తే తన్ను సారాయి వీర్రాజు అన్నారన్నారు. నకిలీ మద్యంతో వైసిపి నేతలు, అప్పటి అధికారులు వేలకోట్లు కూడబెట్టారన్నారు. మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లిన చరిత్ర వారదన్నారు దేశంలో రాహుల్ గాంధీని ప్రజలు పక్కన పెడుతున్నారని, అందుకే ఇంతవరకు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ గెలవ లేదన్నారు. ప్రజాస్వామ్య, సెక్యులర్ భారతదేశంలో 20 కోట్ల మంది ముస్లింలు కూడా భాగస్వాములేనని, వారికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుం దన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు

# దేశీయ పశు సంపద పెంపుదలకు కృషిచేస్తాం

**హుకుంపేటలో ఏఎంసి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం లో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల, ఎంపీ పురందేశ్వరి**





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:**దేశీయంగా పశు సంపదను పెంపుదల చేసుకోవడానికి ఆధునిక బ్రీడ్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రైతులు ముందుకు రావాలని, రాష్ట్రంలో పుంగనూరు, ఒంగోలు జాతి పశువులు అందుబాటులో ఉన్నాయని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. హుకుంపేటలో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మార్ని వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరాన్ని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ పశు సంపద పెరిగితే పాల ఉత్పత్తి పెరుగుతుందని తద్వారా కల్తీ నిరోధించవచ్చానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులకు అవసరమైన గడ్డి, గోకులాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలను బలోపేతం చేసి సెస్‌ను వాటికే ఇస్తే రైతులను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు చేపట్టడానికి ఆస్కారం ఉంటుందన్నారు. పశు సంపదను పెంచుకునేందుకు అన్ని విధాలుగా ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎ ఏంసీ చైర్మన్ మార్ని వాసుదేవ రావు మాట్లాడుతూ, దేశంలో పశు సంపద సంక్షోభంలో ఉందని, పశువులను మేప లేక దాణా ఖర్చులు భరించలేక రైతులు పశువులను కబేలాలకు అమ్ముకుంటు న్నారన్నారు. పశుసంపద, పాల ఉత్పత్తి పెరగడానికి రాష్ట్రానికి పిండ మార్పిడి జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి 1000 పిండాలను సరఫరా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. 2000 సం.లో ఈ ప్రాజెక్టు అమల్లో ఉండేదని గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారిపోవడంతో ఈ ప్రాజెక్టు మూలన పడిందన్నారు. సలేజ్, గడ్డి దాణా ను రాయితీ ధరలకు ప్రభుత్వం అందించాలని, గోకులం షెడ్లు డిజైన్ మార్చాలని, టిఎంఆర్ ను పునరుద్దించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశువుల పెంపకంలో మగ దూడలు కూడా రైతులు పెంచాలని, వరిగడ్డి సేకరణలో రైతులు శ్రద్ధ వహించాలని అన్నారు అనంతరం పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించి రైతులకు అవసరమైన మందులు, ఇతర వస్తువులను పంపిణీ చేసారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఎ ఏంసీ చైర్మన్ మార్ని వాసుదేవ రావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మత్స్యేటి ప్రసాద్, దాలిపర్తి వేమన, చప్పా చిన్నారావు, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, పెండ్యాల రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్నాల లక్ష్మి సంతోషి, గంగిన జాహ్నవి, గ్రంధి విజయలక్ష్మి, బైరెత్తి సరోజినీ దేవి, బొప్పన శ్రీనివాస్, బొప్పన నాగేశ్వరరావు, కరుటూరి శ్రీనివాస్, మట్టా శ్రీనివాస్, సోము వినాయక్, ఎంపీడీఓ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పశు సంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వెన్నా శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- గ్రీవెన్స్‌కు 185 దరఖాస్తులు.. రెవెన్యూ క్లినిక్‌కు 30
- మారుమూల గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ కె.దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 05:** పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాలతో పాటు వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి ప్రజలు సమర్పించే దరఖాస్తులను పరిశీలించి, సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు మిగిలిన సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించి సంబంధిత శాఖల అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం రంపచోడవరం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్), రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిశీలించారు. ఈ వారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 185 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌కు 30 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

**ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం వినతి**

పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన మంటూరు గ్రామానికి చెందిన పల్లాల రాజారెడ్డి తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. వై.రామవరం మండలం దేవరమడుగుల గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కడబాల ఆదివిష్ణు, శైలజ, సుంట్రూ సురేష్ కోరారు. దేవిపట్నం మండలం దండంకి గ్రామంలో వాటర్ ట్యాంకు మరమ్మతులకు గురికావడంతో తాగునీరు సక్రమంగా అందడం లేదని, వెంటనే ట్యాంకును మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందించాలని ఎం.వీరబాబు దరఖాస్తు సమర్పించారు.

**జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని వినతి**

పోలవరం జిల్లాలో నిరుపేదలు అధికంగా ఉన్నారని, వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ జిల్లాలోని 12 మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కత్తుల బాలురెడ్డి, కత్తుల ఆనందు, బచ్చుల మంగిరెడ్డి, పల్లాల సుగ్గిరెడ్డి వినతిపత్రం సమర్పించారు.

**గ్రీవెన్స్‌కు వచ్చిన వారికి ఉచిత వైద్య పరీక్షలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజలకు వైద్య సేవలు కూడా అందించారు. వాసన్ ఐ కేర్ సంస్థ ఆధ్వర్యంలో కుంచే సాల్మన్, బి.లక్ష్మణ్ కుమార్, టి.తరుణ్ కుమార్ సమన్వయంతో సుమారు 150 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే శ్రీ వాణి దంత వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ మహేష్, డాక్టర్ శ్రీవాణి గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మంగదయ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి జి.శ్రీరామ్‌మూర్తి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవదానం, డీసీహెచ్ఎస్ సాంబశివరావు, డ్వామా పీడీ రాంప్రసాద్, పీహెచ్ఓ నరేంద్రకుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు, వివిధ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, డీఈలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



**ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట శాంతియుత నిరసన**

**జేసీకి వినతిపత్రం సమర్పించిన నాయకులు**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:**ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగ హక్కులను పరిరక్షిస్తూ ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరిషత్ నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల భూముల రక్షణ కోసం అమల్లో ఉన్న 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల భూములపై అన్యాక్రాంతాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమాలను ప్రశ్నిస్తూ చట్టబద్ధంగా ఫిర్యాదులు చేస్తున్న తమ సంఘం నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను ఖండించారు. సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం లేకుండా చట్ట ప్రకారం వ్యవహరించాలని, అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలపై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోని అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**స్థానిక ఆదివాసీలకే ఆశా వర్కర్ పోస్టులు**

పోలవరం జిల్లాలో ఆశా వర్కర్ల నియామకాల్లో అక్రమాలకు తావులేకుండా అర్హులైన స్థానిక ఆదివాసీలకే పోస్టులు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య శాఖకు సంబంధించిన పోస్టుల్లో ఆదివాసీలకు నిర్దేశించిన రిజర్వేషన్‌ను అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా రద్దయిన జీవో నంబర్ 3 స్థానంలో ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పించేలా తక్షణమే చట్టబద్ధమైన ప్రత్యామ్నాయాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే నిరుద్యోగ ఆదివాసీ యువతతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ దొర, నాయకులు పీఠ ప్రసాద్, కలుముల ప్రసాద్, కాల్ అరుణ్ కుమారి, బల్లెం గంగాభవాని, కళింకోట శ్రీనివాసరావు, లోత శ్రీనుబాబు, బాధితులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలి





- పోడు భూములకు తక్షణమే పట్టాలు. లేకుంటే ఐక్య పోరాటం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**చింతూరు పెన్ పవర్, అక్టోబర్ 5:** పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం, పునరావాసం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఐక్య పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ ముగింపు సందర్భంగా సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో శ్రీనివాసరావు మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం, అటవీ హక్కుల చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. గిరిజనులకు న్యాయంగా దక్కాల్సిన భూమి హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు, చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాలతో పాటు మొత్తం ఏడు మండలాల్లో సుమారు 1.50 లక్షల మంది నిర్వాసితులవుతున్నారని తెలిపారు. 2022 కాంటూరు లెక్కల పేరుతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. వాస్తవ ముంపు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పునరావాస కాలనీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ముంపు ప్రాంత ప్రజలకు న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించకుండా పోలవరం ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకెళ్తారని ప్రశ్నించారు. ముందుగా నిర్వాసితుల పునరావాసం, పరిహారం పూర్తిచేసిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే వెలుగొండ తరహాలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని, అవసరమైతే పోలవరం ప్రారంభోత్సవాన్ని కూడా అడ్డుకుంటామని హెచ్చరించారు.

**ఏజెన్సీ సమస్యలను పరిష్కరించాలి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే ఏజెన్సీ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల సమస్యలు కొనసాగుతున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాల్సిన ఆర్అండ్ఆర్ కమిషన్ కార్యాలయం ధవళేశ్వరంలో ఉండటంతో ముంపు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం చింతూరులోనే ఆర్అండ్ఆర్ కమిషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.

**సమస్యలు పరిష్కరించకపోతే మరో మన్యం పోరాటం**

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లోతా రామారావు

పోడు భూములు, పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే మరో మన్యం పోరాటానికి సిద్ధమవుతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లోతా రామారావు హెచ్చరించారు. చింతూరు డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, అంగన్వాడీ భవనాలు, ఆరోగ్య కేంద్రాల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాలకు గిరిజన గ్రామాల్లో రహదారులు దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీవో చిత్తపూడి పడాల్‌కు సీపీఎం నాయకులు అందజేశారు. నాలుగు మండలాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తన పరిధిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు, సున్నం రాజులు, మడకం నాగమణి, పల్లపు వెంకట్, సీసం సురేష్, పులి సంతోష్‌కుమార్, సోయం చిన్నాబు, మొట్టం రాజయ్య, మల్లం సుబ్బమ్మ, పొడియం లక్ష్మణ్, యర్రంశెట్టి శ్రీనివాస్, పూనెం ప్రదీప్, ఎంపీటీసీ వెంకట రాజకుమార్, ముర్రం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల తమ సృజనాత్మక ఆలోచనలను అంకుర సంస్థలుగా మలుచుకోవాలి



ఏపీ నిట్ డిజిగ్నేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. వెంకట కృష్ణారావు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ అక్టోబర్ 05.** విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను విద్యా ప్రాజెక్టులకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే అంకుర సంస్థలుగా మలచుకోవాలని ఏపీ నిట్ డిజిగ్నేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. వెంకట కృష్ణారావు సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి వినూత్న పరిష్కారాలను రూపొందించడంతోపాటు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆలోచనలను అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ఏపీ నిట్‌లోని సంస్థాగత ఆవిష్కరణ మండలి (ఐఐసీ), రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (రాజమహేంద్రవరం ,ఆర్‌టీఐహెచ్) సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించనున్న స్పార్క్--ఫ్యూచర్ ఫౌండర్స్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం బృందావనం భవన్‌లో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కె. వెంకట కృష్ణారావు మాట్లాడుతూ వైఫల్యాలను ఎదురుదెబ్బలుగా భావించకుండా, వాటి నుంచి పాఠాలు నేర్చుకుని పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారి ఆలోచనలకు ప్రోత్సాహం అందించేలా విద్యాసంస్థలో అనుకూలమైన ఆవిష్కరణల వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పరస్పరం కలిసి పనిచేయడం ద్వారా వినూత్న ఆలోచనలు, కొత్త భాగస్వామ్యాలు, అంకుర సంస్థల ఏర్పాటుకు అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ ప్రొఫెసర్ జి.రవి కిరణ్ శాస్త్రి మాట్లాడుతూ పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమల మధ్య సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు తమ ఆలోచనలకు శాస్త్రీయతను జోడించి, సమాజ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తే విజయవంతమైన వ్యాపార ఆలోచనలుగా మలచుకోవచ్చని తెలిపారు. పరిశోధన, పరిశ్రమల సహకారం అందితే యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. ఐఐసీ అధ్యక్షుడు డాక్టర్ వి. సందీప్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆవిష్కరణ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంస్కృతిని పెంపొందించేందుకు ఐఐసీ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థుల ఆలోచనలకు సరైన వేదిక, మార్గదర్శకత్వం, అవసరమైన సహకారం అందించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే 'స్పార్క్' ప్రధాన లక్ష్యమని వివరించారు. ఆర్‌టీఐహెచ్ రాజమండ్రి ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యుబేషన్ హెడ్ డాక్టర్ చంద్ర ప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రారంభ దశ ఆలోచనలను గుర్తించి, వాటిని మెరుగుపరిచి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు 'స్పార్క్--ఫ్యూచర్ ఫౌండర్స్' దోహదపడుతుందని తెలిపారు. ఆలోచన నుంచి నమూనా ఉత్పత్తి తయారీ, మార్కెట్ పరిశీలన, అంకుర సంస్థ ఏర్పాటువరకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఐఐసీ సమన్వయకర్త డాక్టర్ టి. కార్తికేయ శర్మ మాట్లాడుతూ 'స్పార్క్' కేవలం శిక్షణ కార్యక్రమం కాదని, విద్యార్థుల ఆలోచనలకు సరైన దిశానిర్దేశం చేసి భవిష్యత్ పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దే ప్రయాణమని పేర్కొన్నారు. యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు నిట్ ఆంధ్రప్రదేశ్ ఐఐసీ ఇప్పటికే పది ఆలోచనలకు ఇగ్నిషన్ గ్రాంట్లు అందించిందన్నారు. రెండో దశ ఇగ్నిషన్ గ్రాంట్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ప్రస్తుతం మూడు అంకుర సంస్థలకు మద్దతు అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి మరో ఐదు అంకుర సంస్థలకు సహకారం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. అనంతరం ప్రొఫెసర్ వెంకట కృష్ణారావును ఘనంగా సత్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, ఆచార్యులు డాక్టర్ శ్రీఫణి కృష్ణ కర్రి, డాక్టర్ టి. కిరణ్, డాక్టర్ తపస్, డాక్టర్ సుదర్శన్ దువాతో పాటు నిట్, కైట్, బీవీసీ, పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# వి.రామన్నపాలెం--నూనెపల్లి రోడ్డు నిర్మాణం చేపట్టాలి



- ఐటీడీఏ ఎదుట యువజన నాయకుల నిరసన
- స్పందించకపోతే రోడ్డుపైనే వంటావార్పు చేపడతాం: పండా సిద్ధార్థ దొర

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** వి.రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని వి.రామన్నపాలెం నుంచి నూనెపల్లి వరకు రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని రంపచోడవరం నియోజకవర్గ యువజన నాయకుడు పండా సిద్ధార్థ దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం కోసం గతంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. రహదారి సౌకర్యం లేక స్థానిక ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి, ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణ పనులకు చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ రహదారి నిర్మాణం ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, ఇకనైనా అధికారులు సమస్యపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని పండా సిద్ధార్థ దొర హెచ్చరించారు. రానున్న రోజుల్లో రోడ్డు నిర్మాణానికి చర్యలు ప్రారంభించకపోతే ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రోడ్డుపైనే వంటావార్పు కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కర్రీ అబ్బాయి రెడ్డి, దేవీపట్నం మండల నాయకులు కుంజం శివ, ఆదివాసీ నాయకులు సిరిమలి రెడ్డి భారత్, ఆదివాసీ పార్టీ నాయకులు పండా కృష్ణమూర్తి, మాజీ మండల యువజన అధ్యక్షులు, రంపచోడవరం నియోజకవర్గ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త సుధీర్ రాజ్ రాపాక, డాక్టర్ హేము, చ.దివాకర్, ప్రేమ్ రెడ్డి, చవలం రాజన్న దొర, సోకల శ్రీను, సాదల వెంకటరెడ్డి, కోట్ల ప్రసాద్ రెడ్డి, కోట్ల లచ్చిరెడ్డి, మడకం భవాని, కుంజం పోసమ్మ, చవలం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని పెట్టుకుని. క్రమశిక్షణతో ముందుకు సాగాలి

భాస్కర విద్యానికేతన్ విద్యార్థులకు డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి దిశానిర్దేశం





**చింతూరు, పెన్ పవర్, అక్టోబరు 5:** విద్యార్థులు చిన్న వయసు నుంచే జీవితంలో ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు క్రమశిక్షణతో కష్టపడాలని చింతూరు డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. చింతూరులోని శ్రీ భాస్కర విద్యానికేతన్‌లో నిర్వహించిన మోటివేషన్ క్లాస్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలంటే ఇప్పటి నుంచే చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మొబైల్ ఫోన్‌ను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. ఎక్కువ సమయం ఫోన్‌లో గడపడం వల్ల చదువుపై ఆసక్తి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. మొబైల్‌ను చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలని చెప్పారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు కూడా దెబ్బతింటుందని హెచ్చరించారు. స్నేహితుల ఒత్తిడి ఉన్నప్పటికీ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్న వయసులోనే మంచి అలవాట్లు అలవర్చుకుని, క్రమశిక్షణతో చదువుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. జీవితంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిరసాని వేణుగోపాల్‌రావు, ప్రిన్సిపాల్ వి. రాంబాబు, ఏసీఓ చిరసాని త్రివీణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 05.** తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో హౌసింగ్ కాలనీలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించేందుకు చేపట్టిన జిఎస్బి మరియు బిటి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన/ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అతిథిగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే డ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ హాజరై అభివృద్ధి పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన ఈ రహదారి పనులకు మొత్తం అంచనా వ్యయం ?4.81 కోట్లు. తో షేశంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎన్డీయే కూటమి నాయకులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, స్థానిక నాయకులు, గ్రామ నాయకులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## పోలీసులు వాహనాలు తనిఖీ పలు వాహనాలకు అపరాధ రుసుము...



**అడ్డతీగల, పెన్ పవర్ ,అక్టోబర్ 05;** సోమవారం సాయంత్రం అడ్డతీగల స్థానిక సీతపల్లి జంక్షన్ లో పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలలో వాహన పత్రాలు సరిలేని వాహనాలకు, హెల్మెట్ ధరించని వాహనదారులకు అపరాధ రుసుము విధించారు. సుమారు 3200 అపరాధ రూపం విధించినట్లు అడ్డతీగల ఎస్సై బి. వినోద్ తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలి

* ఆర్ట్స్ కళాశాలలో వార్షిక ఫెస్ట్ లో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** ఆర్ట్స్ కళాశాల ప్రతిష్టను, ఘన చరిత్రను కాపాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన వార్షిక అకడమిక్ ఫెస్ట్-2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రిన్సిపాల్, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం కళాశాల ముఖద్వారాన్ని ఆధునికీకరిం చడం జరిగిందన్నారు. మెగా డీఎస్సీ, ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని తెలిపారు. కళాశాలకు కన్వెన్షన్ సెంటర్, ఇండోర్ షటిల్ కోర్టుఆర్ట్స్ కళాశాలకు సమీపంలో అత్యాధునిక కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వాసు హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ కోరిన మేరకు ఇండోర్ షటిల్ కోర్టును శాప్ ద్వారా మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఫుట్‌బాల్ మైదానం, చుట్టూ గ్యాలరీ ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. త్వరలో మరో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్లడమే అకాడమిక్ ఫెస్ట్ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యతో పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రిన్సిపాల్ వివరించారు. అనంతరం పలు అంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, జ్ఞాపికలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## మండల ప్రజలకు దసరా దీపావళి ధమాకా ఆఫర్




**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** మండల ప్రజలకు దసరా దీపావళి ధమాకా ఆఫర్ లో భాగంగా లక్కీ డీప్ ద్వారా విలువైన బహుమతులు ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

నిబంధనల ప్రకారం ఒక కుటుంబం నుండి 5 కేజీలకు పైగా పొడి చెత్తను స్వచ్ఛ రధానికి ఇచ్చిన ప్రతి కుటుంబానికి ఒక టోకెన్ ఇవ్వబడుతుందని తెలిపారు. లక్కీ డిప్ ద్వారా విజేతలను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతిగా బట్టర్ ఫ్లై డ్రై కుక్కర్, రెండవ బహుమతిగా బటర్ ఫ్లై మిక్సర్ గ్రైండర్, మూడో బహుమతిగా పానాసోనిక్ రైస్ కుక్కర్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాత పేపర్లు, అట్టలు, ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్లు, గాజు సీసాలు, లోహపు వస్తువులు, పాత బట్టలు, పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు, టైర్లు, చెక్క వస్తువులు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## పెట్రోల్ బంక్ నిర్మాణంపై చట్టి గ్రామసభ తీర్మానం



**చింతూరు పెన్ పవర్ అక్టోబర్ 5:** ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టం ప్రకారం గ్రామసభ తీర్మానానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుందని చట్టి గ్రామంలో జరిగిన గ్రామసభ మరోసారి స్పష్టం చేసింది. చింతూరు మండలం చట్టి గ్రామంలో పోడియం లక్ష్మి, గంగవరం గ్రామానికి చెందిన మర్మం నరసింహారావు మధ్య జరిగిన భూమి లీజు ఒప్పందం ఆధారంగా పెట్రోల్ బంక్ నిర్మాణానికి సంబంధించి గ్రామసభ నిర్వహించారు. పెసా చట్టం 1996, ఆంధ్రప్రదేశ్ పెసా నిబంధనల ప్రకారం భూ బదలాయింపు చట్టాలకు ఎలాంటి విఘాతం కలగకుండా అన్ని అంశాలను పరిశీలించారు. పెట్రోల్ బంక్ నిర్మాణం వల్ల గ్రామ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామసభ సూచించింది. పెట్రోల్ బంక్ ద్వారా కలిగే ఉపాధి అవకాశాల్లో స్థానిక గిరిజన యువతీ, యువకులకు ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానించింది. అలాగే చట్టపరమైన నిబంధనలను పూర్తిగా పాటిస్తూ గ్రామ అభివృద్ధికి యజమాని సహాయ సహకారాలు అందించాలని గ్రామసభ సూచించింది. అనంతరం ఈ అంశాలపై చర్చించి గ్రామసభ తీర్మానాన్ని ఆమోదించింది. కార్యక్రమంలో పెసా కమిటీ ఉపాధ్యక్షుడు తుర్రం చిన్నముత్తయ్య, కార్యదర్శి పోడియం రామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ తుర్రం రాముడు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# డైమండ్స్ వనిత లయన్స్ క్లబ్స్ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం(ఇంటర్నేషనల్ టీచర్స్ డే)








**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 05.** తాడేపల్లిగూడెం డైమండ్స్ మరియు వనిత లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం లయన్స్ 316జి జిల్లా రీజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణం రాజు సౌజన్యం తో ఘనంగా జరిగాయి. ఆర్ సి. లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు

సమాజ నిర్మాతఅని సమాజంలో చీకట్లను తొలగించి, జ్ఞాన దీపాలు వెలిగించే శిల్పి ఉపాధ్యాయులని కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువలదే అని సంపూర్ణ జీవితానికి బాటలు తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, ఆ జీవితానికి ఒక సార్థకతను, సరైన గమ్యాన్ని చూపించేది గురువే. అందుకే మన సంస్కృతిలో "మాతా పితా గురు దైవం" అని గురువుకు దేవునితో సమానమైన స్థానం ఇచ్చారని అన్నారు ఈ సందర్భంగా స్థానిక గరల్స్ హైస్కులు లోను కడియద్ద జిల్లా పరిషత్ హైస్కులు లో ను ఆర్ అండ్ బి గ్రౌండ్స్ లోను ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పి. సుబ్బలక్ష్మి . కె. రామకృష్ణ గరల్స్ హైస్కులు. విశ్రాంత ఏం ఈ. ఓ. గాజుల మురళీ కృష్ణ. పి. డి. చింతకాయల సత్యనారాయణ లను శాలువా లతో సన్మానం జరిపి జ్ఞాపికలు అందచేశారు.. ఈ కార్యక్రమం లో లయన్స్ ఇంద్రవాణి. కొత్త సుభద్ర. బడుగు చంద్రశేఖర్. కొత్త ఉమా మహేశ్వరి. సీతాళం లక్ష్మి దేవి (నాయవాది) నాగలక్ష్మి. లు మాట్లాడారు సమాజానికి దిక్కుచి లాంటి వారు ఉపాధ్యాయలన్నారు ఈ కార్యక్రమం లో ఆర్ అండ్ బి వాకర్స్ ప్రసిడెంట్ మానేపల్లి కిరణ్ కుమార్. రాజా త్రినాధ్ ఆంజనేయ స్వామి రెడ్డి సత్యనారాయణ. దాసరి వెంకటేశ్వర రావు గ్రంధి అపర్ణ ప్రసాద్.బాబురావు.టి యస్. ఎన్.( నాని )తదితరులు పాల్గొన్నారు

# పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు -- ఐడీ కార్డుల పంపిణీ.








**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 05.** తాడేపల్లిగూడెం పట్టణంలోని 31వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తల ఐడి కార్డులు పంపిణీ చేశారు.వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు బలం చేకూర్చేలా, పార్టీ పట్ల వారి నిబద్ధతకు గుర్తింపుగా, నాయకత్వ స్ఫూర్తిని పెంపొందిస్తూ ప్రజల్లో మంచి పేరు, ప్రతిష్టలు సాధించేలా పార్టీ కార్యకర్తలకు ఐడీ కార్డులు అందజేశారు. మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్తకు పార్టీ పరంగా గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ఈ ఐడీ కార్డులను అందించడం జరిగింది అన్నారు.తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు చేతుల మీదుగా కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు.

పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందిన సందర్భాల్లో వారి కుటుంబాలకు పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించడం జరిగింది. ప్రస్తుతం మాయమాటలతో అధికారం పొందిన కూటమి పార్టీలు వారి కార్యకర్తలకు ఇన్సూరెన్స్ సభ్యత్వ రుసుముక్రింద సుమారు 300/- రూపాయలు కార్యకర్తల నుండి వసూలుచేసి ఇన్సూరెన్స్ సభ్యత్వం ధ్వారా అందిస్తున్న.

ఈ నేపథ్యంలో మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కమిటీలలో నియమితులై పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు/కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందిన సందర్భంలో వారి కుటుంబానికి పార్టీ తరఫున రూ.5,00,000/- (ఐదు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్చార్జులు వివిధ హోదా నాయకులు ఎంపీపీలు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు వైఎస్ఆర్సిపి నాయకుల కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు..

# పశువులకు అడ్డగా మారిన ఎన్ హెచ్ 516 రహదారి...



**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 05;** సోమవారం అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామంలో ఎన్. హెచ్ 516 రహదారిపై పశువులు రహదారికి అడ్డముగా సేద తీరుతున్నాయి. దీనిని గమనించిన అడ్డతీగల ఎంపీడీవో ఏ వి వి కుమార్ తన వాహనాన్ని ఆపి గ్రామస్తులను పిలిచి పశువులు ఎవరివి అని ప్రశ్నించారు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయదారుల పశువులు అని వారు బదులిచ్చారు. సాయంత్రం సమయంలో రహదారికి అడ్డముగా పడుకోవడం జరుగుతుందని, దీనివలన వాహన ప్రమాదాలు అధికమవుతున్నాయని ఎంపీడీవో కుమార్ కు వారు బదులిచ్చారు . ఈ విషయంపై ఎంపీడీవో మాట్లాడుతూ తరచూ ఈ ప్రాంతంలో వాహన ప్రమాదాలు పశువులు రహదారి కి అడ్డంగా ఉండడం వల్ల జరుగుతున్నాయని, దీనివలన కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని, పశువుల యజమానులకు ఈ విషయాన్ని గ్రామస్తులు తెలియజేయాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు. పశువుల యజమానులు ఈ విషయంపై శ్రద్ధ వహించాలని, లేకుంటే తదుపరి చర్యలు చేపడతామని ఎంపీడీవో కుమార్ హెచ్చరించారు.

# మానవత్వం చాటుకున్న త్రినేత్ర హాస్పటల్ ఎండీ



**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 5 ;** పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత చీడూరు గ్రామానికి చెందిన సంకూరు వెంకటరెడ్డి , ఇద్దరు కుమారులు విపరీతమైన జ్వరంతో జంగారెడ్డిగూడెం త్రినేత్ర ఆస్పత్రి లో చేరారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంట్స్ వాళ్లకి ఏమీ తెలియని పరిస్థితులు హాస్పటల్ సిబ్బంది అక్కున చేర్చుకుని వారి వివరాలు తెలుసుకొని వారికి ఆధార్ కార్డులు గాని రేషన్ కార్డు గాని ఏమీ లేవు. కనీసం ఓపి సీటు కూడా డబ్బులు లేకుండా వారికి ఉన్న స్థితిలో దయానియా నియంగా ఉన్న వారి స్థితి తెలుసుకొని ఆసుపత్రి త్రినేత్ర ఆస్పత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ ఎండి చవల నాగేంద్ర బాబుకి సిబ్బంది వారి పూర్తి వివరాలు తెలుసుకుని ఆస్పత్రి ఎండి సవల నాగేంద్ర బాబుకి విషయాన్ని తెలియజేయగా ఆయన రోగుల పరిస్థితిని అర్థం చేసుకొని వారి దగ్గర కనీసం ఓపి రుసుము కూడా తీసుకోకుండా ఉచితంగావైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా మూడు రోజులు తీవ్రమైన జ్వరం అనారోగ్యంతో బాధపడుతున్న సుంకర వెంకటరెడ్డి, కుమారులకు అందించడమే కాకుండా ఆహారం అందించి, ఉచిత మందులు వారికి వైద్య పరంగా పలు సూచనలు చేసి సోమవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగాఆయన తన మానవత్వాన్ని సాటుకుని కార్పొరేట్ వైద్యాన్ని అందించినటువంటి డాక్టర్ ను పలువురు స్వచ్ఛంద సామాజిక కార్యకర్తలు ఆయన అభినందించారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు పెద్దలు ఉచితంగా వైద్య సేవలు అందించిన డాక్టర్ సవలని ప్రశంసలు కురిపించారు. ఎండి,డాక్టర్ సవల నాగేంద్రబాబు మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యమే కాకుండా నిరుపేదలకు అందుబాటులో అందించడానికి త్రినేత్ర హాస్పటల్ సిబ్బంది ఎప్పుడు సిద్ధంగా ఉంటారని అన్నారు. డబ్బులుతో కాదు మానవత్వంతోటే హాస్పిటల్స్ సిబ్బంది ప్రవర్తిస్తారని వైద్య సేవలు అందిస్తామని, ప్రతి సామాన్య ప్రజలకు త్రినేత్ర ఆసుపత్రు లో వైద్య సేవలు అందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు.



# ఇండియా, వెస్టిండీస్‌కు బిగ్ షాక్.. రెండు జట్లకు ఐసీసీ భారీ జరిమానా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, వెస్టిండీస్ జట్లకు బిగ్ షాక్ తగిలింది. ఇటీవల ముగిసిన వన్డే సిరీస్?లో భాగంగా న్యూచండీగఢ్ వేదికగా జరిగిన చివరిదైనా మూడో వన్డేలో స్లో ఓవర్ రేటింగ్ కారణంగా ఇరుజట్లకు ఐసీసీ జరిమానా విధించింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఇండియాకు 20 శాతం, వెస్టిండీస్?కు 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించారు. ఈ మ్యాచులో భారత్, వెస్టిండీస్ ఇరుజట్లు నిర్ణీత సమయంలోగా బౌలింగ్ కోటాను పూర్తి చేయలేదని ఆన్-ఫీల్డ్ అంపైర్లు జయరామన్ మదనగోపాల్, సామ్ నోగాజ్స్కీ, థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా, ఫోర్త్ అంపైర్ వీరేందర్ శర్మ ఐసీసీకి ఫిర్యాదు చేశారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ ఇద్దరూ తమ తప్పును అంగీకరించారు. దీంతో ఎలాంటి అధికారిక విచారణ లేకుండానే మ్యాచ్ రెఫరీ ప్రకాష్ భట్ జరిమానా విధించారు.

ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా వేసే ప్రతి ఓవర్‌కు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 5 శాతం చొప్పున పెనాల్టీ విధిస్తారు. భారత్ నాలుగు ఓవర్లు, వెస్టిండీస్ రెండు ఓవర్లు ఆలస్యంగా వేసినట్లు తేలింది. దీంతో గిల్ సేనకు 20 శాతం, వెస్టిండీస్? ఆటగాళ్లకు 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత పడింది.

**వన్డే సిరీస్ ఇండియా వశం..!**

భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్?ను టీమిండియా 2-1 తేడాతో దక్కించుకుంది. సిరీస్‌లోని తొలి రెండు వన్డేలను గెలిచిన భారత్ మూడవ వన్డేలో ఓటమి పాలైంది. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన చివరి వన్డేలో పర్యాటక జట్టు విజయం సాధించింది. కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీ సాధించిన ఇండియా ఓటమి పాలైంది.

# 2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యంత కీలకం: దినేశ్ కార్తీక్

- కెప్టెన్ గిల్‌కు రోహిత్ అనుభవం, సలహాలు ఎంతో ఉపయోగపడతాయన్న దినేశ్
- ఒత్తిడి సమయాల్లో గిల్.. రోహిత్‌పైనే ఆధారపడతాడని కార్తీక్ జోస్యం
- దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనున్న 2027 ప్రపంచకప్
- వన్డేల్లో తనకు ఇంకా పని మిగిలి ఉందని రోహిత్ ఇటీవలే చెప్పిన వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ సేవలు అత్యంత కీలకం కానున్నాయని టీమిండియా మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ అపారమైన అనుభవం, ప్రస్తుత ఫామ్ జట్టుకు అతిపెద్ద బలమని, ముఖ్యంగా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు అతని మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కార్తీక్ పేర్కొన్నాడు.వెస్టిండీస్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌ను దినేశ్ కార్తీక్ ఉదాహరణగా చూపించాడు. గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఛేజింగ్ సమయంలో రోహిత్ శర్మ సాధించిన సెంచరీ అతని ఫామ్‌కు నిదర్శనమని ప్రశంసించాడు. ఆటలో ఎదురయ్యే తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడంలో రోహిత్ అనుభవం గిల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నాడు.ఈ విషయంపై కార్తీక్ మాట్లాడుతూ.. "ఒక కెప్టెన్‌గా, నాయకుడిగా ఆటలో ఉత్కంఠభరితమైన క్షణాల్లో రోహిత్ ఇచ్చే సలహాలు అమూల్యమైనవి. ముఖ్యంగా ఒక పెద్ద మ్యాచ్‌లో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కచ్చితంగా రోహిత్ వైపే చూస్తాడని, అతనిపైనే ఆధారపడతాడని నేను భావిస్తున్నాను" అని స్పష్టం చేశాడు. సీనియర్ ఆటగాడిగా, మాజీ కెప్టెన్‌గా జట్టులో రోహిత్ పోషించే పాత్ర కీలకమని పేర్కొన్నాడు.కాగా, వన్డే ఫార్మాట్‌లో తనకు ఇంకా 'పని మిగిలి ఉంది' అని, 2027 ప్రపంచకప్‌లో ఆడాలనే తన కోరికను రోహిత్ శర్మ ఇటీవల బహిరంగంగా వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో ఆడటమే లక్ష్యంగా హిట్ మ్యాన్ ముందుకు సాగుతున్నాడు. వన్డేల్లో నిలకడగా పరుగులు సాధిస్తుండటంతో, రాబోయే ప్రపంచకప్ కోసం భారత జట్టు రూపొందించే ప్రణాళికల్లో రోహిత్ శర్మ కేంద్ర బిందువుగా కొనసాగుతున్నాడు.

# గంగూలీ కెప్టెన్సీలో టీమిండియా లక్ష్యం అదే.. సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు



- గంగూలీ జట్టు లక్ష్యం విదేశాల్లో ఎక్కువ విజయాలేనన్న సెహ్వాగ్
- అప్పటి జట్టు ఆ లక్ష్యాన్ని సాధించిందని వ్యాఖ్య
- ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాట్లాడలేనన్న సెహ్వాగ్
- మ్యాచ్ పరిస్థితికి తగ్గట్టే తన ఆట మార్చేవాడినని వివరణ
- అవసరమైతే రక్షణాత్మకంగా ఆడానని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** సౌరవ్ గంగూలీ నాయకత్వంలో టీమిండియా ఎలా ఆడేదో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. విదేశీ గడ్డపై వీలైనన్ని మ్యాచ్‌లు గెలవాలన్నదే అప్పటి జట్టు ప్రధాన లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాత్రం తాను మాట్లాడలేనని స్పష్టం చేశాడు.'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సెహ్వాగ్ ఐఏఎన్ఎస్‌తో మాట్లాడాడు. ఈ సందర్భంగా అప్పటి జట్టు ఆలోచనా విధానాన్ని వివరించాడు. "నేను దాదా నాయకత్వంలోని జట్టులో ఉన్నాను. కాబట్టి ఆ జట్టు ఆలోచనా విధానం గురించి చెప్పగలను. ప్రస్తుత జట్టులో నేను లేను. వారి ఆటతీరు గురించి నాకు పూర్తిగా తెలియదు. అందుకే దానిపై మాట్లాడలేను" అని సెహ్వాగ్ అన్నాడు.గంగూలీ నాయకత్వంలో తమ ప్రధాన లక్ష్యం అంతర్జాతీయ మ్యాచ్ లలో ఎక్కువగా గెలవడమేనని చెప్పాడు. విదేశీ గడ్డపై విజయాలు

సాధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెలిపాడు. ఆ లక్ష్యాన్ని జట్టు సాధించిందని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు.తాను ఎప్పుడూ దూకుడుగా ఆడేవాడిని కాదని కూడా సెహ్వాగ్ గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావించాడు. మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరును మార్చుకునేవాడినని తెలిపాడు. అవసరమైనప్పుడు రక్షణాత్మకంగా కూడా ఆడానని చెప్పాడు.సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్ ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఓపెనింగ్ జోడీల్లో ఒకటిగా నిలిచింది. ఇద్దరూ కలిసి టీమిండియా ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించారు.'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్‌కు సెహ్వాగ్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు. గత సీజన్‌లో ఈ బాధ్యతలు నిర్వహించిన అశ్నీర్ గ్రోవర్ స్థానంలో అతడు వచ్చాడు. ఈ రియాలిటీ షోలో 15 మంది కంటెస్టెంట్లు 42 రోజుల పాటు పోటీపడతారు. అధికారాన్ని దక్కించుకోవడం, వ్యూహాలు, పొత్తులు ఈ ఆటలో కీలకంగా ఉంటాయి. ఈ షో అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో ప్రసారం అవుతోంది.



కలలు కనే డీప్-రెడ్ వెల్వెట్ లుక్‌లో యుక్తి తరేజా స్టన్స్

# వారణాసి.. ఎంత చెప్పాలో అంతే..

రాజమౌళి సినిమా అంటే షూటింగ్ మొదలైనప్పటి నుంచి రిలీజ్ వరకు ఒక ఐరన్ కాంపౌండ్ లాంటి సెక్యూరిటీ ఉంటుంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ టైమ్ లో ఎవరెంత మాట్లాడాలో ఆయన కంట్రోల్ లోనే ఉండేది. కానీ మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' ప్రాజెక్ట్ విషయంలో మాత్రం సీన్ పూర్తిగా రివర్స్ అయింది. సినిమా గురించి టీమ్ నుంచి చిన్న చిన్న అప్డేట్స్ రెగ్యులర్ గా బయటకు రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.



ఈ సినిమా బ్యాక్ డ్రాప్ పై అసలు హింట్ మొదట రైటర్ విజయేంద్ర ప్రసాద్ నుంచే వచ్చింది. ఇది ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగే అడ్వెంచర్ అని ఆయన చెప్పగా.. ఆ తర్వాత స్వయంగా రాజమౌళే గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ అంటూ ఒక క్లారిటీ ఇచ్చేశాడు. దీనికి తోడు మహేష్ బాబు కూడా ఆఫ్రికా షెడ్యూల్స్, అడవుల్లో షూటింగ్ ఎక్స్ పీరియన్స్ గురించి ఓపెన్ గా మాట్లాడటంతో సినిమా థీమ్ ఏంటనేది జనాలకు ఈజీగా అర్థమైపోయింది.

మరోవైపు ఎప్పుడూ తన పనేదో తాను సైలెంట్ గా చేసుకుపోయే సంగీత దర్శకుడు కీరవాణి కూడా ఈసారి తన పంథా మార్చారు. సినిమాలో మొత్తం ఆరు పాటలు ఉంటాయని, మ్యూజిక్ వర్క్ ఎంతవరకు వచ్చిందో కచ్చితమైన వివరాలు బయటపెట్టారు. గతంలో జక్కన్న సినిమాల్లో సాంగ్స్ కౌంట్ రిలీజ్ టైమ్ వరకు సస్పెన్స్ గానే ఉండేది. కానీ ఏకంగా 2027 సమ్మర్ రిలీజ్ టార్గెట్ అంటూ కీరవాణి ముందే ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.ఇక యాక్షన్ ఎపిసోడ్స్ మీద రీసెంట్ గా ఎస్ఎస్ కార్తికేయ ఇచ్చిన హైప్ అంతా ఇంతా కాదు. ఆర్ఆర్ఆర్, బాహుబలిని మించేలా సీట్ ఎడ్జ్ యాక్షన్ ఉంటుందని ఆయన చెప్పగా.. తన క్యారెక్టర్ లో కూడా హెవీ స్టంట్స్ ఉంటాయని హీరోయిన్ ప్రియాంక చోప్రా ముందే ఒక క్లూ ఇచ్చింది. ఇలా టీమ్ లోని ఒక్కొక్కరు ఒక్కో పాయింట్ ను రివీల్ చేస్తుండటంతో, ప్రేక్షకుడి మైండ్ లో 'వారణాసి' కాన్వాస్ పై ఒక స్ట్రాంగ్ ఇమేజ్ క్రియేట్ అయిపోయింది.అయితే బయటపడుతున్న ఈ విషయాలన్నీ కథను డ్యామేజ్ చేసే లీకులు ఏమాత్రం కాదు. ఎవరెన్ని చెప్పినా మహేష్ మెయిన్ క్యారెక్టరైజేషన్, అసలు కాన్ఫ్లిక్ట్, స్టోరీలో వచ్చే మేజర్ ట్విస్టులు మాత్రం ఇంకా రాజమౌళి లాకర్ లోనే సేఫ్ గా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే జక్కన్న ఈసారి కండిషన్స్ కు కాస్త బ్రేక్ ఇచ్చి, సినిమా బజ్ ను ఎప్పుడూ పీక్స్ లో ఉంచేలా పక్కా క్యాలిక్యులేటెడ్ గానే ఈ ఇన్ఫర్మేషన్ ను వదులుతున్నట్లు అనిపిస్తోంది.గతంలో రాజమౌళి సినిమాల చిన్న అప్డేట్ కోసం ఫ్యాన్స్ నెలల తరబడి వెయిట్ చేసేవాళ్లు. కానీ ఇప్పుడు గ్లోబల్ మార్కెట్ ను టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో, సినిమా గురించి కంటిన్యూస్ గా బజ్ ఉండడం అవసరం. అందుకే రాజమౌళి లిమిట్స్ సడలించి, ప్రమోషన్ కు ఉపయోగపడే కంటెంట్ ను టీమ్ ద్వారానే బయటకు రప్పిస్తున్నారు. దీంతో వారణాసి పేరు ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉండేలా మాస్టర్ ప్లాన్ వేశారని అర్థమవుతోంది.



హెబ్బా పటేల్ యొక్క రొమాంటిక్ రెడ్ గౌన్ లుక్ స్వచ్ఛమైన సొగసుగా ఉంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965